క్లుప్తంగా

ప్రజల్లోకి తీసుకెళ్లడానికే వికసిత్ భారత్



మాట్లాడుతున్న ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కావూరివారిపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలను తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమాలను ప్రజలకు గుర్తు చేస్తుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలను వీడియో ద్వారా వీక్షింపచేశారు. వాసుదేవనాయుడు, వ్యవసాయ అధికారి కల్యాణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పవన్, డీడీఓ ప్రభుకిరణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోవిందయ్య పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న నేతలు

పాలసముద్రం: వైఎస్సార్‌సీపీ నేతలు గెలుపే లక్ష్యంగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ తెలిపారు. ఆదివారం బలికండ్రిగలో పార్టీ కార్యకర్తల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. అనంతరం బలిజకండ్రిగలో వేస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు. సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, సుందరరాజు, ధనంజయన్, రవిరెడ్డి, కుట్టి, ప్రకాష్, చిన్నపయ్యన్, బాబు, చంద్రశేఖర్‌రాజు, వేణు, సుమన్, నరసింహన్, మనోహర్, గోపాల్, లోకిదాస్, నరసింహనాయుడు పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) వ్యవస్థాపకుడు ఎం.బాలకృష్ణమ్మ చిరస్మరణీయమని సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో బాలకృష్ణమ్మ 11వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అఖిల భారత ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణమ్మ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యారంగ ప్రజాఉద్యమంలో ఆయన కీలక భూమిక పోషించారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల రెండో ఘాట్‌రోడ్‌లో ఆదివారం ఓ వాహనం అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు తిరుమలకు వస్తుండగా మూడో కిలోమీటర్ వద్ద ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరు భక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

యువతిని బెదిరించి దోపిడీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం వకులమాత ఆలయం సమీపంలో యువతిని బెదిరించి గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీ చేశారు. పుంగనూరుకు చెందిన మునస్వామి కొడుకు దేవకుమార్ తన సమీప బంధువు మాధవితో కలిసి ఆదివారం వాహనంలో తిరుపతి నుంచి పుంగనూరుకు వెళ్తున్నారు. అయితే వకులమాత ఆలయం సమీపంలో బహిర్భూమి కోసం యువతి కారు దిగింది. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మాధవిని బెదిరించి ఆమె చేతికి ఉన్న మూడు ఉంగరాలను, సెల్ ఫోన్‌ను లాక్కున్నారు. దేవకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్‌ఐ మూర్తి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

చంద్రగిరి: మండలంలోని మామండూరు సమీపంలో జాతీయ రహదారిపై స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..భాకరాపేట గాంధీనగర్‌కు చెందిన నారాయణ, కల్యాణ్ చక్రవర్తి రామచంద్రాపురం మండలం నూతుగుంటపల్లిలో జల్లికట్టు చూసేందుకు బైక్‌పై బయలుదేరారు. ఐతేపల్లె సమీపంలోని దాబాలో భోజనం చేసి తిరిగి హైవేలోకి వస్తుండగా చిత్తూరు వైపు నుంచి రాజమండ్రికి వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కల్యాణ్ చక్రవర్తి, నారాయణ తీవ్రంగా గాయపడగా, 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కల్యాణ్ చక్రవర్తి (35)మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఆనందమని పింఛన్

నా మనవడు సీఎం జగన్ చెప్పినట్టు చేశాడని ఓ అవ్వ మాటల్లో ఆనందం.. నా పెద్దకొడుకు నన్ను ఆదుకుంటున్నాడు ఓ తల్లి ధైర్యం.. ఇంటి పెద్ద చచ్చిపోవడంతో వరుస ఇబ్బందులు.. పింఛన్ రాకపోయే .. బతకడం ఎందుకు అనుకున్న తరుణంలో మా జగనన్న పాలనలో వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకుని పింఛన్ మంజూరు చేసి నాకు ఓ భరోసా ఇచ్చారని ఓ వితంతు చెల్లి.. ఇలా పింఛన్ తీసుకుంటున్న ఎవరి నోట విన్నా ఇవే మాటలు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేలుకు పింఛన్ పెంచిన మాట తప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటూ పింఛన్‌దారుల నోటి నుంచి ఈ మాటలు మార్మోగిపోతూనే ఉన్నాయి. అందరి బాగోగులు చూసుకుంటున్న జగనన్న మళ్లీ రావాలంటూ వేనోళ్లా కోరుకుంటున్నాయి.

- పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల రోజుల తరబడి తిరిగే పని లేదు
- ఎప్పుడు పింఛన్ ఇస్తారోనని ఎదురు చూసే రోజులూ పోయాయి
- వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందిస్తున్నారు
- పార్టీలు, రాజకీయాలకు అతీతంగా పింఛన్ మంజూరు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారు





పుత్తూరులో లబ్ధిదారురాలు జ్ఞానమ్మకు పింఛన్ అందిస్తున్న కౌన్సిలర్ రాధ, నాయుడుపేటకు వెళ్లి పింఛన్, ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న వలంటీర్ సుమలత

పుత్తూరు: పండుటాకుల జీవితాలకు ముఖ్యమంత్రి జగన్ అండగా నిలిచారు. అవసాన దశలో కొందరు, ఇంటి పెద్దదిక్కును కోల్పోయి ఒంటరిగా ఉన్న మహిళలు కొందరు, మంచాన పడి, కిడ్నీలు చెడిపోయి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు.. ఇలా ఎంతోమంది అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడు అయ్యారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.250 పెంచుకుంటూ వచ్చి తాజాగా రూ.3 వేలు చేసి పింఛన్‌దారులకు అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టో పేరిట వాగ్దానాలను కుమ్మరించే రాజకీయ పార్టీలకు అతీతంగా, అధికారంలోకి వచ్చిన తొలిసారే వైఎస్సార్‌సీపీ తమ మేనిఫెస్టోలోని వాగ్దానాల్లో 99 శాతం నెరవేర్చి సరికొత్త చరిత్రను సృష్టించింది. వలంటీర్ల ద్వారా ఒకటో తారీఖునే ఎక్కడున్నా అక్కడికే వెళ్లి మరీ పింఛను అందిస్తున్నారు. ప్రతి సంక్షేమ పథకం అమలవుతున్న తీరు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

నాటి చంద్రబాబు పాలనలో అలా..

గత చంద్రబాబు ప్రభుత్వలో ఇచ్చే వెయ్యి రూపాయల పింఛను తీసుకోవడానికి అష్టకష్టాలు పడేవారు. టీడీపీ పాలనలో 60 ఏళ్లు నిండి అర్హత ఉన్నా కూడా ఫించన్ మంజూరు చెయ్యండయ్యా అంటే ఎవరెవరినో కాళ్లా వేళ్లా పడి బతిమాలుకునే దౌర్భాగ్య పరిస్థితి ఉండేది. అయినా జన్మభూమి కమిటీలు కనికరించేవి కాదు. అందులోనూ టీడీపీకి అనుకూలంగా ఉంటేనే పింఛన్ మంజూరు చేసేవారు. పైగా వారికి ఎంతోకొంత ముట్టజెబితే గానీ పింఛన్ మంజూరయ్యేది కాదు. ఒకవేళ మంజూరైనా.. ఏ నెల ఏ తేదీన, ఎక్కడ ఇస్తారో తెలియదు.. పొద్దున నుంచి సాయంత్రం వరకు, రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది.

నేటి జగనన్న పాలనలో ఇలా..

కుల, మత, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వెళ్లి మరీ పింఛన్లు అందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా, ఇతర కారణాలతో సుదూర ప్రాంతాల్లో ఉన్నా, వలంటీర్లు వెతుక్కుంటూ వెళ్లి మరీ పింఛన్ అందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్నారు.

నగరి నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్న పింఛన్ల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	నగదు మొత్తం రూ.లక్షల్లో
నగరి పట్టణం	5,720	165.65
నగరి మండలం	7,898	236.43
పుత్తూరు పట్టణం	5,932	179.41
పుత్తూరు మండలం	3,882	114.35
నిండ్ర మండలం	4,823	139.74
విజయపురం	5,261	153.47
వడమాలపేట	5,399	161.97
మొత్తం		1,151.02

మా ఇంటి పెద్దకొడులా..



నాపేరు అనురాధ. నాది పేద కుటుంబం. నా భర్త చనిపోయాడు. వృద్ధాప్యంతో కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు పలు మార్లు అర్జీ ఇచ్చినా నాకు ఫించను మంజూరు చేయలేదు. నా పెద్దకొడుకు జగనన్న వచ్చాక నాకు వెంటనే వితంతు పింఛను మంజూరైంది. గత నాలుగేళ్లుగా నాకు వలంటీర్ ఇంటి వద్దకే తెచ్చి పింఛన్ అందిస్తున్నాడు. ఈనెల రూ.3 వేలు అందుకున్నాను. ఇకపై నాకు ఎవరిపై ఆధారపడాల్సిన పని లేదు. – ఎం.అనురాధ, తాయిమాంబాపురం, పుత్తూరు

ధైర్యంగా ఉంది..



నాపేరు దేవానమ్మ. గత నాలుగేళ్లుగా నాకు ఇంటి వద్దకే ఫించన్ తెచ్చి ఇస్తున్నారు. అంతకుముందు అలా ఇచ్చేవారు కాదు. గంటల తరబడి నిల్చోవాలి. ఈనెల రూ.3 వేలు ఇచ్చారు. ఇది నా జీవనానికి సరిపోతుంది. ఆరోగ్యం సరిగా లేకపోయినా మా ఆళ్లపాకం గ్రామానికే డాక్టర్లు వచ్చి వైద్యం అందిస్తున్నారు. ఇంటి వద్దకే రేషన్‌బియ్యం అందుతోంది. ఇంతకుమించి ఏమి కావాలి? ధైర్యంగా నా జీవితాన్ని గడుపుతున్నాను. జగనన్నే మళ్లీ వస్తే ఇంకా మంచి పనులు చేస్తాడనే నమ్మకం ఉంది.

– దేవానమ్మ, ఆళ్లపాకం దళితవాడ, విజయపురం మండలం

విజయకాంత్‌కు మంత్రి రోజా నివాళి



విజయకాంత్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా దంపతులు

నగరి : తమిళనటుడు, డీఎండీకే పార్టీ అధ్యక్షులు విజయకాంత్ కర్మక్రియల కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా, తన భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, అత్త షన్ముగంతో కలిసి పాల్గొన్నారు. విజయకాంత్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన భార్య ప్రేమలతను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విజయకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తమిళ్‌సెల్వన్, వీరం వెలంజమన్ను, రెండు చిత్రాలు తాను విజయకాంత్‌తో నటించానన్నారు. తన భర్త ఆర్కే సెల్వమణి విజయకాంత్‌తో దర్శకత్వం వహించిన పులన్‌విసారనై, కెప్టెన్ ప్రభాకరన్ చిత్రాలు ఆయన కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌చిత్రాలుగా నిలిచాయని ఆమె గుర్తుచేసుకున్నారు. మంచి మనిషిని తమిళ చిత్రసీమ కోల్పోయిందన్నారు.

నిజమైన జననేత సీఎం జగన్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- పింఛన్ రూ.3 వేల పెంపుతో ఆనందం
- మండలంలో 6,534 మందికి పింఛన్
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



హాజరైన లబ్ధిదారులు

శ్రీరంగరాజపురం: ప్రతి పేదవాడి ఇంటికి పెద్ద కొడుకులా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన జననేత అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారిని, చదువు రాని వారిని ఆర్థికంగా, సామాజికంగా వారికి న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఉద్దేశమన్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వలంటీర్లు అందిస్తున్నారన్నారు. ప్రతినెలా 1న ఉదయం 6 గంటలకల్లా తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెప్పి అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి విద్యకు పెద్దపీట వేశారని తెలిపారు. సంక్షేమ పథకాల ప్రదాత జగనన్నను 2024లో ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, ఎంపీటీసీ శివయ్య, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమాణ్యంరెడ్డి, మండల కన్వీనర్ మణి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గురవారెడ్డి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, తహసీల్దార్ బెన్నూరాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, నేతలు జనార్దన్, కుప్పయ్య, కాలప్ప, విజయబాబు, సురేష్‌రాజు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్య పథం

- రసాయనేతర పంటల గురించి ప్రజలు ఆలోచిస్తున్నారు
- రైతులు తమ ఆరోగ్యం కోసమైనా ప్రకృతి పద్ధతిలో పంటల సాగు చేయాలి
- కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడమే కేంద్రం లక్ష్యం
- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం

నగరి : ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య పథమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనేతర పంటల లాభాలను అధిక శాతం ప్రజలు తెలుసుకుంటున్నారని ధర ఎక్కువైనా వెచ్చించి కొనడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్గానిక్ పంటల కోసం సుదూర ప్రాంతాలకు సైతం వెళ్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన పంటలపై అవగాహన పెరిగిందని, దీంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించే మార్గంలో రైతులు ప్రయాణించాలన్నదే తమ ధ్యేయమన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రప్రభుత్వం రైతు సాధికార సంస్థ అంటూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం కూడా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలన్న ప్రయత్నంలో ఉందన్నారు. తొలుత రైతులు వారి ఆరోగ్యం కోసం వారికి ఉన్న పొలంలో కొంతమేర ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయాలన్నారు. అప్పుడు వ్యత్యాసం వారే గమనిస్తారన్నారు. ఖర్చు తక్కువ అవుతుందని ఆరోగ్యమైన పంటను చూస్తారన్నారు. రసాయనాలు దిగుబడి ఎక్కువగా ఇచ్చినా ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. అది అనారోగ్యం పండించినట్లే అన్నారు. జిల్లాలో ఉన్న పంచాయతీలలో దాదాపు మూడింట ఒక భాగంలోనే సాగు చేస్తున్నట్లు తెలిపారు. మెలమెల్లగా ప్రకృతి వ్యవసాయ సాగువిస్తీర్ణం పెంచాలన్నారు. పండించిన కూరగాయల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు పండించే ఆర్గానిక్ కూరగాయలు అక్కడికక్కడే విక్రయించుకోవచ్చన్నారు.

సేవాభావంతో పని చేయండి

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేవాభావంతో పని చేయాలని రైతులను ఈ వ్యవసాయం వైపునకు మళ్లించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరగా ప్రధానంగా వ్యవసాయంలో కూలీల కొరత ఉందని ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెడితే పలువురికి లాభం చేకూరుతుందని, అలాగే పంట విక్రయ కేంద్రాన్ని పట్టణంలో త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు సూచించారు. రైతుల కోరికను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ గురుప్రసాద్, మహేష్, నాంచారమ్మ, మాస్టర్ ట్రైనర్లు ప్రతాప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కూచిపూడి నృత్యాలు చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. తిరుపతి సాయినాథ్ బృందం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మహాగణపతి, బ్రహ్మాంజలి, గోవింద గోవింద, మద్దుగారే, కోలాటం, అలరులు కురియగు, బ్రహ్మమొక్కటే, తక్కువైమమనకు, కొండల్లో నెలకొన్న వంటి పాటలకు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- 5 రోజుల్లో 600 మందికి చికిత్స
- 152 మంది కంటిపొర ఆపరేషన్‌కు ఎంపిక

నగరి : కంటివైద్య చికిత్సను ఉచితంగా అందించడానికి మంత్రి ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఐదు రోజులకు 600 మందికి వైద్య సిబ్బంది చికిత్స అందించారు. వీరిలో కంటిపొర కారణంగా చూపు మందగించిన 152 మందిలో 80 మందికి మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా మైక్రో స్కోపిక్ స్మాల్ ఇన్‌సిషన్ అనే ఆధునిక పద్ధతిలో ఆపరేషన్ చేయగా మిగిలిన వారికి సోమవారం చేయనున్నారు. చెన్నై ఆస్పత్రిలో చికిత్స అందించేందుకు 200 మందిని ఎంపిక చేసినట్లు శంకర నేత్రాలయ ప్రతినిధి అరుల్‌కుమార్ తెలిపారు. చికిత్స నిమిత్తం కార్యాలయం వద్దవున్న వారికి భోజన సౌకర్యం కల్పించారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

యాదవ సంఘం నూతన కార్యవర్గం



రమేష్ యాదవ్, అధ్యక్షుడు



వెంకటరమణ ప్రధాన కార్యదర్శి



పరశురామ్ యాదవ్, కార్యదర్శి

పుత్తూరు: వడమాలపేట మండలం శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వడమాలపేటలోని సీఎంఆర్ కల్యాణ మండపంలో సంఘ మాజీ అధ్యక్షుడు జి.సుబ్రమణ్యంయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో అధ్యక్షుడిగా వి.రమేష్‌యాదవ్, గౌరవాధ్యక్షుడిగా కె.సదాశివయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా వి.సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటరమణయాదవ్, కార్యదర్శిగా ఎస్.పరశురామ్ యాదవ్, సహాయ కార్యదర్శిగా జి.మోహన్‌యాదవ్, కోశాధికారిగా ఎం.చిన్నబ్బయాదవ్, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ మాజీ అధ్యక్షుడు జి.సుబ్రమణ్యం యాదవ్ మాట్లాడుతూ మండలంలో కల్యాణ మండపం నిర్మాణానికి, యాదవ సంఘ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నీరాలి మండపం..కల సాకారం

- రూ.1.60 లక్షలు వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం
- నెరవేరిన నగరవాసుల కోరిక



స్కంధపుష్కరిణికి అందం తీసుకొచ్చిన నీరాలి మండపం

కార్వేటినగరం: కాడువెట్టి నగరంగా (అడవిని నరికి) కార్వేటినగరంగా రూపాంతరం చెందేలా చేసిన సంస్థానాధీశులు 19వ శతాబ్దంలో కరువు నుంచి ప్రజలను కాపాడేందుకు అప్పటి కార్వేటినగరం సంస్థానాధీశుడైన వెంకటపెరుమాళ్ రాజు 14 ఎకరాల విస్తీర్ణంలో స్కంధ పుష్కరిణిని నిర్మించారు. కూలీలకు స్వయంగా మహారాజే ధనాన్ని దోసిళ్లతో నాణేలను కూలీగా ఇచ్చారని చెబుతారు. దక్షణాసియాలోనే ఎక్కడా ఇలాంటి పుష్కరిణి లేదంటున్నారు. పుష్కరిణి మెట్లపై నాటి శిల్పికళ నేటికి చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది. అలాగే పుష్కరిణిలోని నీటి మట్టం కూడా ఏ వైపుచూసినా సమాంతరంగా ఉండడం నాటి శిల్పుల గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రతి ఏటా సంస్థానాధీశులు సంతానం కోసం నగరంలో నిర్మించిన శ్రీసంతాన వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే చక్రస్నానం, శ్రీసీతా కోదండరాములు, శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు పుష్కరిణిలో వైభవంగా నిర్వహిస్తారు. అలాగే పుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లోని తెప్పోత్సవాలను పుష్కరిణిలో నిర్వహించడం జరుగుతుంది. తిరుమల పుణ్యక్షేత్ర పుష్కరిణిలో ఉన్న నీరాలి మండపం నిర్మాణం చేపట్టాలనే కోరిక నగరవాసులను వెంటాడేది. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక, మండల వాసి కళత్తూరు నారాయణస్వామి ఉప ముఖ్యమంత్రిగా పదవి స్వీకరించడంతో నీరాలి మండడం నిర్మాణం కల నెరవేరుతుందని స్థానికులు భావించారు. దీంతో సమాచారాన్ని ఉపముఖ్యమంత్రికి చేరవేయడంతో స్పందించిన మంత్రి వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.కోటి అరవై లక్షలు మంజూరు చేయించారు. వందల సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న స్థానికుల కలలను నెరవేర్చి అభివృద్ధి పనులు చేయడంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి మించిన వారు లేరని చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు హర్షిస్తున్నారు.

కలకాదు నిజం అనిపించారు



చారిత్రిక కట్టడంగా నిలిచిన స్కంధపుష్కరిణి నిరాలి మండపం నిర్మాణం సాధ్యం కాదనుకున్నా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే డిప్యూటీ సీఎం నారాయణస్వామి నగరాన్ని దత్తతకు తీసుకుని పట్టణ అభివృద్ధితో పాటు పుష్కరిణి నీరాలి మండపం నిర్మాణం చేసి కలను నిజం చేసి నిరూపించుకున్న జగనన్న ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఎప్పుడు రుణపడి ఉంటాం. –మోహనకుమారి, కార్వేటినగరం

రుణపడి ఉంటాం



ఉప ముఖ్యమంత్రిగా నారాయణస్వామి కార్వేటినగరం అభివృద్ధితో పాటు సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన పురాతన కట్టడాల అభివృద్ధికి రూ.కోట్ల నిధులు వెచ్చించి స్కంధ పుష్కరిణిలో నీరాలి మండపం నిర్మాణంతో పాటు పుష్కరిణి చుట్టూ పార్కింగ్ ఏర్పాటుకు కృషి చేసి అభివృద్ధి దిశగా తీసుకెళుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి నగర ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. – గిరిజ, కార్వేటినగరం